క్లుప్తంగా

అందుబాటులో రాయితీపై టమాటాలు



రైతుబజార్‌లో టమాటా విక్రయ స్టాల్

ఏయూ క్యాంపస్: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న టమాటాలు పెదవాల్తేరు రైతుబజార్‌లో అందుబాటులోకి వచ్చాయి. గురువారం నుంచి రాయితీపై కిలో రూ.50కి టమాటాలు విక్రయిస్తున్నారు. వినియోగదారులకు ఒక్కో కిలో చొప్పున టమాటాలు విక్రయించినట్లు ఎస్టేట్ ఆఫీసర్ వరలక్ష్మి తెలిపారు. తొలిరోజు 1295 కిలోలు విక్రయాలు జరిగాయన్నారు.

13వ వార్డులో అన్నసమారాధన

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శివాజీనగర్-2లో మత్యాలంబ అమ్మవారి పండగ గత నెల 29న జరిగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో గురువారం అన్నసమారాధన చేపట్టారు. ఆరిలోవ కాలనీ, శివాజీనగర్, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, పాండురంగాపురం, ఆపరేషన్ కాలనీ, శ్రీకాంత్‌నగర్, ఎస్‌కేఎంఎల్ నగర్, భగత్‌సింగ్‌నగర్, తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించారు.

భీశెట్టి రామారావు ఆశయాల సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న హనుమంతురావు

బీచ్ రోడ్డు: రైతు రాజు రామారావు చారిటబుల్ ట్రస్ట్ అధినేత భీశెట్టి రామారావు ఆశయాల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు హనూస్ ఫిలిం ఫ్యాక్టరీ సీఈవో భీశెట్టి హనుమంతురావు తెలిపారు. రామారావు జయంతి సందర్భంగా గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతురావు మాట్లాడుతూ పేదల పెన్నిధిగా రామారావు 200లకుపైగా జంటలకు వివాహం చేశారన్నారు.

జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూ క్యాంపస్: భారత ప్రభుత్వ నేషనల్ జస్టిస్-ఎంపవర్‌మెంట్ మంత్రిత్వ శాఖ దివ్యాంగుల కోసం పాటు పడుతున్న వ్యక్తులు, స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సర్వశ్రేష్ట దివ్యాంగ్‌జన్, శ్రేష్ట దివ్యాంగజన్, శ్రేష్ట దివ్యాంగ బాల, బాలిక అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా అర్హులైన వారు www.awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్ జయంతి విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న అక్కరమాని విజయనిర్మల

ఆరిలోవ: ఈ నెల 8న జరగనున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని వైఎస్సార్‌సీపీ నాయకులు తూర్పు నియోజకవర్గంలో అన్ని వార్డుల్లో ఘనంగా నిర్వహించాలని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిలతో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పేదలకు విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు ముచ్చల లక్ష్మి, గేదెల లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదల మేలు కోసమే 'జగనన్న సురక్ష'

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని
- 16వ వార్డులో 576 మంది పలు ధ్రువపత్రాల అందజేత



16వ వార్డులో ధ్రువ పత్రాలు అందిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి

మద్దిలపాలెం: పేదలకు మేలు చేయడం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల తెలిపారు. జీవీఎంసీ 16వ వార్డులో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మొల్లి లక్ష్మితో కలిసి ఆమె అర్హులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హత ఉన్నా చాలా మందికి వాటికి అవసరమైన ధ్రువ పత్రాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలల్లో పిల్లలను చేర్పించడానికి అవసరమైన కుల ధ్రువీకరణ పత్రం ఈ కార్యక్రమం ద్వారా సకాలంలో అందుతుందన్నారు. ఇలా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఇంటి వద్దకే తీసుకెళ్లి అందించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇలాంటి బృహత్తర కార్యక్రమాలు ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. కార్పొరేటర్ లక్ష్మి మాట్లాడుతూ వార్డు పరిధిలో 576 మందికి పలు ధ్రువ పత్రాలు అందజేశామన్నారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, ఏపీడీవో దుర్గాప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ శోభన్, సీవో నరసింహ, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చొల్లంగి నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు పోల రత్నం, యూత్ అధ్యక్షుడు పల్లా శ్రీను పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ జీవితం ఆదర్శనీయం



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు

ఏయూ క్యాంపస్: నేటి తరం రాజకీయ నాయకులకు, యువతకు బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం ఆదర్శంగా నిలుస్తుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఏయూలోని ఆయన విగ్రహానికి వీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ తన ప్రతిభతో తాను చేపట్టిన రక్షణ, కార్మిక, వ్యవసాయ, రైల్వే వంటి శాఖలను సమర్థవంతంగా నిర్వహించిన విధానం ప్రశంసనీయమన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అందించిన సహాయం, తోడ్పాటు చాలా జీవితాలను మార్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అకడమిక్ స్టాఫ్ కాలేజ్ సంచాలకుడు ఆచార్య టి.వి.కృష్ణ, టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.అర్జున్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, బోధనేతర ఉద్యోగులు బాబ్జీ, రవి, విద్యార్థి నాయకులు వెంకట్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ఎం.కల్యాణ్, డాక్టర్ మోహన్, ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన కల్పించాలి



సచివాలయం సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులోని ప్రజలకు జగనన్న సురక్షపై అవగాహన కల్పించాలని కార్పొరేటర్ కెల్ల సునీత సూచించారు. సచివాలయ సిబ్బంది, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులతో ఆమె గురువారం వార్డు పరిధి ఎనిమిదో నంబరు సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 19న వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం జరగనుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువపత్రాలు ప్రజలకు అందజేస్తారన్నారు. వార్డులో వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు జగనన్న సురక్ష గురించి వివరించాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, వీర్రాజు, శిరీష, ఎంఎల్‌వో షణ్ముఖ పాల్గొన్నారు.

మొక్కల పెంపకం



మొక్కలు నాటుతున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు మాధ్యమం పాఠశాలలో రోటరీ క్లబ్ సభ్యులు గురువారం మొక్కలు నాటారు. పాఠశాలలో వాటర్ ఫిల్టర్, డిజిటల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు, అధ్యక్షుడు డి.ఎం.రావు, కార్యదర్శి రఘుపతి, బి.మధు, డి.శ్రీనివాస్, డాక్టర్ పద్మ, డాక్టర్ సుమన, బి.మణి పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులకు పాఠశాల హెచ్ఎం కె.సలోమి కృతజ్ఞతలు తెలిపారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ గుడ్ల విజయసాయి

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డులో భూగర్భ డ్రైనేజీ పనులకు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల గురువారం కార్పొరేటర్ గుడ్ల విజయసాయితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ రూ.16 లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భూగర్భ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ సమస్య త్వరలో పరిష్కారం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుడ్ల సత్యారెడ్డి, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

అభిమానుల రక్తదానం



రక్తదాతలను అభినందిస్తున్న ఎంపీ జీవీఎల్

ఏయూ క్యాంపస్: రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పుట్టిన రోజు సందర్భంగా గురువారం బీచ్ రోడ్డులోని ఏయూ సాగరిక హాల్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రజా సేవకులను సత్కరించారు. అనంతరం కొంత మంది అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ నగరాధ్యక్షుడు రవీంద్రరెడ్డి, పార్టీ నాయకులు కరణంరెడ్డి నరసింగరావు, ఎస్.వి.ఎస్.ప్రకాష్‌రెడ్డి, సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

సర్వీసు రోడ్డులో యథేచ్ఛగా పార్కింగ్



పిఠాపురం కాలనీ సర్వీసు రోడ్డులో పార్కింగ్ వేసిన వాహనాలు

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలోని కళాభారతి రోడ్డులో ఉన్న కూరగాయల మార్కెట్ నుంచి జాతీయ రహదారిని ఆనుకున్న ఉన్న సర్వీసు రోడ్డు అక్రమ పార్కింగ్‌లకు అడ్డాగా మారింది. భారీ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. వీటితోపాటు ప్రైవేట్ కాలేజీల బస్సులు, ఏటీఎం మిషన్‌లకు డబ్బులు లోడ్ చేసే ప్రైవేట్ వాహనాలు, ఆటోలు, ఇలా పదుల సంఖ్యలో వాహనాలు రోడ్డుపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.ఎస్.వి.శర్మ, పిఠాపురం కాలనీ

రక్షణ గోడ నిర్మించరూ..



కాలువ పక్కన రక్షణ గోడ లేని డెయిరీ ఫారం పోస్టాఫీస్ రోడ్డు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు డెయిరీ ఫారం వద్ద పోస్టాఫీస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. దీని పక్కన సుమారు 4 అడుగుల లోతులో కాలువ ఉంది. కానీ రక్షణ గోడ లేదు. రోడ్డు పైనుంచి చూస్తే ఇది లోయ మాదిరిగా కనిపిస్తుంది. సుమారు 200 మీటర్లు పొడవు ఉండే ఈ రోడ్డుకు కాలువ వైపు రక్షణ గోడ లేకపోవడంతో ఎదురుగా వచ్చిన వాహనాలను తప్పించబోయి వాహనచోదకులు అదుపుతప్పుతున్నారు. అధికారులు స్పందించి ఇక్కడ రోడ్డు పక్కన రక్షణ గోడ నిర్మించాలి.

– ఎస్.సత్యనారాయణ, డెయిరీ ఫారం


కనకమహాలక్ష్మి అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ

దాబాగార్డెన్స్: సిరులతల్లి కనకమహాలక్ష్మికి శ్రీకాకుళం జిల్లాకు చెందిన వి.రమ్య కుటుంబ సభ్యులు 262 గ్రాముల వెండి కిరీటం బహూకరించారు. వెండి కిరీటాన్ని ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలానికి అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్త ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక ఇంజినీరు సీహెచ్‌వీ రమణ, ఆలయ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

శివాజిపాలెంలో వ్యక్తిపై దాడి

ఏయూ క్యాంపస్: స్థానిక శివాజిపాలెం కృష్ణుడి ఆలయం వద్ద జరిగిన వివాదంలో ఒక వ్యక్తి తలకు గాయమైనట్లు సమాచారం. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో జరిగిన చిన్న వివాదం ఈ దాడికి దారితీసినట్లు తెలిసింది. స్థానికంగా నివాసం ఉంటున్న ఒక వ్యక్తిని అదే ప్రాంతానికి చెందిన నలుగురు దాడి చేసి గాయపరిచినట్టు సమాచారం. దీనిపై ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నాయి. దీనిపై పోలీసులను వివరణ కోరడానికి ప్రయత్నించగా.. అందుబాటులో లేరు.

సీఏ ఫలితాల్లో విద్యార్థిని ప్రతిభ



మణిసహస్రని అభినందిస్తున్న వీసీ

ఏయూ క్యాంపస్: ఐసీఏఐ విడుదల చేసిన సీఏ ఇంటర్ ఫలితాలలో అఖిలభారత స్థాయిలో 36వ స్థానం సాధించిన ఎస్.మణి సహస్రని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో అభినందించారు. భవిష్యత్తులో మరింత ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఈ సీఏ అకాడమీ డైరెక్టర్ సీఏ సుధీర్, రామచంద్రం, ప్రిన్సిపాల్ పి.ఎస్.వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

మర్రిపాలెం: మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్నారని సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, కంచరపాలెం పోలీసులు సంయుక్తంగా గురువారం దాడులు నిర్వహించారు. ఊర్వశి జంక్షన్ దరి బర్మాక్యాంప్ వద్ద ఓ మెడికల్ షాపులో తనిఖీలు చేయగా పెంటాజోసిన్, లేక్టేట్ (1ఎంఎల్) 850 ఇంజెక్షన్లు లభ్యమయ్యాయి. షాపు యజమాని గెద్దం కళ్యాణ్, ప్రసాద్, పెదపూడి రాంప్రసాద్ కలిసి ఈ ఇంజక్షన్లను విక్రయిస్తున్నట్టు తేలింది. వారిని అదుపులోకి తీసుకుని మత్తు ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

దాబాగార్డెన్స్: వర్షాకాలం దృష్ట్యా వార్డుల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఓ ప్రకటనలో కోరారు. మురుగునీరు, వర్షపు నీరు సాఫీగా పోయేలా ప్రధాన గెడ్డల్లో వ్యర్థాలు తొలగించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

గోపాలపట్నం: రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గోపాలపట్నం రైల్వేస్టేషన్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్‌కు చెందిన డొపా సీతారామ్(అలియాస్ రాము) (50) ప్రైవేటు పనులు చేస్తూ కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. రెండు రోజుల క్రితం విజయనగరం జిల్లా చీపురుపల్లి వెళ్లిన అతడు ఈ రోజు ఉదయం తిరుగు ప్రయాణమయ్యాడు. సింహాచలం రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెంపుడు జంతువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



తోటగరువు పశు వైద్యశాలలో మేయర్ సమక్షంలో కుక్కకు టీకా వేస్తున్న జేడీ డాక్టర్ రామకృష్ణ



తోటగరువు పశువైద్యశాలలో టీకాలు కోసం పెంపుడు కుక్కలతో యజమానులు

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- ఘనంగా ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

ఆరిలోవ: పెంపుడు జంతువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి సూచించారు. తోటగరువు పశు వైద్యశాలలో గురువారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పెంపుడు కుక్కల యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కుక్కలకు ఉచిత ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు. ముఖ్యఅతిథిగా మేయర్ మాట్లాడుతూ మనుషులతో పాటు మూగ జీవాల ఆరోగ్యం కోసం కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. పశువుల కోసం ప్రత్యేకంగా 1962 అంబులెన్స్ అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. దీంతో ప్రమాదానికి గురైన పశువులు, అనారోగ్యానికి గురైన పశువుల వద్దకు వెళ్లి తక్షణ వైద్య సేవలు అందుతున్నాయన్నారు. అనంతరం పశు సంవర్థక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. గురువారం తోటగరువు పశు వైద్యశాలలో 476 కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. సంవత్సరానికి ఒకసారి తప్పనిసరిగా కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. లేదంటే ర్యాబిస్ వ్యాధి సోకే ప్రమాదముందన్నారు. ర్యాబిస్ సోకిన పిచ్చి కుక్క కరిస్తే మనిషికి ప్రాణాంతకమన్నారు. జిల్లాలో 20 వేల ర్యాబిస్ వ్యాక్సిన్ డోసులు సిద్ధంగా ఉన్నాయని ఆయన చెప్పారు. పెంపుడు శునకాల యజమానులు వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం మేయర్ సమక్షంలో కుక్కలకు వ్యాక్సిన్ వేసి, వాటికి అవసరమైన ఆహారం ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడీలు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ దేవులపల్లి శంకరరావు, డాక్టర్ బి.రామ్మోహనరావు, ఏడీలు డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ మదీనాప్రసాద్, డాక్టర్ ఎల్.కన్నయ్యనాయుడు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

పెంపుడు శునకాల సంరక్షణపై అవగాహన

మద్దిలపాలెం: పెంపుడు శునకాల సంరక్షణపై శ్రద్ధ చూపించాలని, వాటి ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించి సకాలంలో వైద్యం అందించాలని ఇసుకతోట పశుసంవర్ధక శాఖ పశువైద్యాధికారి డాక్టర్ పూర్ణిమ అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా గురువారం పశుసంవర్ధ వైద్యశాలలో పెంపుడు శునకాల యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాబిస్ వ్యాక్సిన్ ప్రక్రియ చేపట్టారు. డాక్టర్ పూర్ణిమ మాట్లాడుతూ పెంపుడు శునకాలతో ఎంతో సన్నిహితంగా ఉంటారని, వాటి నుంచి ఎలాంటి వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేవీవో ఇ.శశికళ, ఓఎస్ ఒమ్మి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జూనోసిస్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి



తోటగరువు హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారులు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనోసిస్ దినోత్సవంపై పశు వైద్యాధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తోటగరువు పశు వైద్యశాల ఏడీ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్యాధికారులు జూనోసిస్ వ్యాధులు ఎలా సంక్రమిస్తాయో వివరించారు. జూనోసిస్ వ్యాధులు జంతువులు ద్వారా మనుషులకు, మనుషులు ద్వారా జంతువులకు సంక్రమిస్తాయన్నారు. ఈ వ్యాధులు 250కి పైగా ఉన్నాయన్నారు. పిచ్చి కుక్క మనిషిని కరిస్తే ర్యాబిస్ వ్యాధి సోకుతుందన్నారు. ఈ వ్యాధికి మందు లేదని తెలిపారు. అందుకే కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. జూనోసిస్ వ్యాధుల గురించి ఇంట్లో తల్లిదండ్రులకు, బంధువులకు కూడా వివరించాలన్నారు.

యువకుడిని కబళించిన లారీ



ఘటనా స్థలంలో పూతి మహేష్ మృతదేహం, ప్రమాదానికి కారణమైన లారీ

అక్కిరెడ్డిపాలెం: బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన యువకుడిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో యువకుడు సంఘటన స్థలంలోనే దుర్మరణం చెందాడు. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివీ.. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంనకు చెందిన పూతి మహేష్(25) స్విగ్గీలో పని చేస్తున్నాడు. మహేష్ గురువారం ద్విచక్ర వాహనంపై గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్దకు రాగానే.. వెనుకనే వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో.. మహేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న ఏసీపీ త్రినాథ్, ఎస్ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని.. ప్రమాదంపై ఆరా తీశారు. వివరాలు సేకరించి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. లారీని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహేష్ అవివాహితుడు. అతని తల్లిదండ్రులు వీరఘట్టంలోనే ఉంటున్నారని ఎస్ఐ తెలిపారు.

ఏవీకే డిగ్రీ కళాశాల మూసివేతపై ఆందోళన



ఏయూ మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: గాజువాకకు చెందిన ఏవీకే డిగ్రీ కళాశాల అర్ధాంతరంగా మూసివేతపై ఆంధ్ర విశ్వవిద్యాలయం మెయిన్‌గేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఆ కళాశాల విద్యార్థులు ఆందోళన చేశారు. కళాశాలలో చదువుతున్న 400 మందికి పైగా విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల మూసివేస్తున్నట్లు యాజమాన్యం తమకు చెప్పిందని, వేరొక కళాశాలలో చేరాలని సూచిస్తున్నారని వాపోయారు. కళాశాలను కొనసాగించాలని, తరగతులను తక్షణం నిర్వహించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. అనంతరం ఏయూ సీడీసీ డీన్ ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కళాశాల యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని డీన్ హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె.నాయుడు, సభ్యులు జి.పల్లవి, ఎం.శశికుమార్, సాయి తేజ, ఎం.తేజ, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.